


ఉష్ణోగ్రత (అంచనా) 25-5-2025

	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	27
తెనాలి	34	27
నరసరావుపేట	35	26
బాపట్ల	34	28
రెంటచింతల	35	26
చీరాల	34	28

వేగం.. ప్రమాదం





నియంత్రించలేక.. నైపుణ్యం కొరవడి..

అధిక సీసీ సామర్థ్యం కలిగిన బైక్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఈ బైక్‌లపై ఊహకందని స్పీడ్‌తో వెళ్తూ వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాల భారిన యువకులు, విద్యార్థులు పడుతున్నారు. దీనికి తోడు ఈ మధ్య చాలామంది టీనేజర్స్ కారు డ్రైవింగ్‌పై ఆసక్తి చూపుతున్నారు. గేర్లులేని కార్లు అందుబాటులోకి రావడం వాటిని నడిపే నైపుణ్యం వారిలో లేకపోవడం వంటి కారణాలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

(గుంటూరు(తూర్పు) - ఆంధ్రజ్యోతి)

- వేగం.. ఆపై నిద్రమత్తు.. బాపట్ల జిల్లా స్టూవర్టుపురంలో ఆరుగుర్ని బలితీసుకుంది.
- రైల్లో వస్తున్న స్నేహితుడ్ని తీసుకువచ్చేందుకు అర్ధరాత్రి వెళ్తూ రోడ్డు పక్కన ఆగిన లారీ చీకట్లో కానరాక ఢీకొని తెనాలి సమీపంలోని అంగలకుదురులో ఓ యువకుడు మృతి చెందాడు.

ఇలా.. శుక్రవారం తెల్లవారుజామున గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పది మంది చనిపోయారు. ఇలా తరచూ జరిగే రోడ్డు ప్రమాదాల్లో ఎందరో మరణిస్తున్నారు. మద్యం మత్తులో, సెల్‌ఫోను మాట్లాడుతూ, రాంగ్‌రూట్ ఇలా అనేక చిన్నపాటి నిర్లక్ష్యాలతో విలువైన ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ప్రమాదం అంటే ఒక వ్యక్తి రోడ్డున పడటం కాదు. ఒక కుటుంబం రోడ్డున పడటం... అని ఓ యువ హీరో ఆవేదన వ్యక్తం చేశాడు. అంటే ఇక సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో పరిస్థితి అర్థం (మిగతా 6వ పేజీలో)

నిర్లక్ష్య ప్రయాణాలతో ప్రమాదాలు

- ట్రాఫిక్ రూల్స్ పట్టని వాహనదారులు
- రోడ్డు ప్రమాద మృతుల్లో యువతే అధికం
- హెల్మెట్లతో రక్షణ అంటున్నా పట్టించుకోని బైకర్లు
- ప్రమాదాలు తగ్గించాలన్న లక్ష్యాలు ప్రణాళికలకే పరిమితం

వేగం.. నిర్లక్ష్యం.. రాంగ్‌రూట్.. ఓవర్‌టేక్.. మద్యం మత్తులో.. ప్రయాణాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎందరినో బలి తీసుకుంటున్నాయి. జాతీయ రహదారు లైనా.. రాష్ట్ర రహదారులైనా.. గ్రామీణ రోడ్లు అయినా వాహనదారులు పట్టించుకోకుండా దూసుకెళ్తూ మృత్యు దరికి చేరుతున్నారు. జనసంచారం ఉన్నా.. రద్దీ మార్గా లైనా.. ట్రాఫిక్ రూల్స్‌ను వాహనదారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. దీంతో వాహనాలు ఢీకొని ఎందరో మరణిస్తుండగా వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తీవ్రగాయాలతో జీవచ్ఛవాలుగా మారుతున్న వారు ఎందరో ఉన్నారు. నిత్యం ఎక్కడో ఒక దగ్గర ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా.. ఎందరో మరణిస్తున్నా.. వాహనదారుల్లో నిర్లక్ష్యం మాత్రం తగ్గడంలేదు. ర్యాష్ డ్రైవింగ్.. స్నేక్‌డ్రైవింగ్‌లతో యువత తమతో పాటు రోడ్డుపై వెళ్తున్న వారిని బలితీసుకుంటున్నారు. 2025లో గుంటూరు జిల్లాలో జరిగిన ప్రమాదాల్లో 490 మంది ద్విచక్ర వాహన దారులు మృతి చెందగా వారిలో దాదాపు 70 శాతం వరకు యువకులే ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

సిఫార్సులతోనే లైసెన్సు

అమెరికా వంటి దేశాల్లో డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడం క్లిష్టమైన ప్రక్రియ. అనేక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి. అందుకే అక్కడ లైసెన్స్ వచ్చిన వారు పార్టీ కూడా ఇస్తుంటారు. కానీ మనదేశంలో 78 శాతం వరకు లైసెన్స్‌లు సిఫార్సుల మేరకే జారీ అవుతూ ఉంటాయి. అందుకే ఇక్కడ వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఉండదు.

స్పీడ్‌గన్‌తో.. నియంత్రణ

వాహనాల అధిక వేగాన్ని అరికట్టేందుకు స్పీడ్‌గన్‌ను గుంటూరు సమీపంలోని మానస సరోవరం వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేశారు. దీంతో వాహన దారులు ఈ ప్రాంతంలో నెమ్మదిగా ప్రయాణిస్తుండటంతో ప్రమాదాలు ఇటీవల చాలా వరకు తగ్గాయి. ఇలా స్పీడ్‌గన్‌లతో ప్రమాదాలు నియంత్రించే అవకాశం ఉండటంతో ఇటీవల రెండో స్పీడ్ గన్ ఏర్పాటుకు రవాణాశాఖాధికారులు చర్యలు చేపట్టారు.



ఆధిపత్య పోరులో.. జంట హత్యలు



పల్నాడులో టీడీపీ నేతలు ఇద్దరి హత్య

- బైకుపై వెళ్తుండగా కారుతో ఢీకొట్టి సోదరుల హతం
- వేరే పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన నిందితులు
- జంట హత్యల్లో పిన్నెల్లి సోదరుల హస్తముందన్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి
- నాడు వైసీపీ హయాంలో.. నేడు కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతల హతం

గుంటూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): అసలే పల్నాడు.. ఆపై ఆధిపత్య పోరు. ఎప్పటి నుంచో టీడీపీలో ఉన్న వారు.. ఇటీవల పార్టీ కండువా కప్పుకున్న వారు పెత్తనం కోసం కక్షలు పెంచుకున్నారు. మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో అధికార పార్టీలో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో శనివారం గుండ్లపాడు గ్రామానికి చెందిన తొలి నుంచి టీడీపీలో ఉన్న జెవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావులు హత్యకు గురయ్యారు. వీరిని అదే గ్రామానికి చెందిన తోట వెంకట్రామయ్య, జెవిశెట్టి శ్రీనివాసరావులు కారుతో ఢీకొట్టి హత్య చేశారు. గుండ్లపాడులో వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేత తోట చంద్రయ్య హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఇప్పుడు కూటమి



ఎమ్మెల్యేకు ఘటన గురించి వివరిస్తూ విలపిస్తున్న కుటుంబ సభ్యులు

అధికారంలోకి వచ్చి సంవత్సరం గడవకముందే టీడీపీ నేతల హత్యతో గుండ్లపాడు ఉలిక్కిపడింది. నాడు వైసీపీ హయాంలోనూ, నేడు టీడీపీ నేతృత్వ కూటమి ప్రభుత్వంలోనూ టీడీపీ నేతల హత్యకు గురికావడంతో ఆ పార్టీ వర్గీయుల్లో ఆందోళన నెలకొంది. గుండ్లపాడు గ్రామ టీడీపీలో చంద్రయ్యతో పాటు ఆది నుంచి జెవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావు కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. చంద్రయ్య హత్యానంతరం వెంకటేశ్వర్లు పార్టీలో ముఖ్యపాత్ర తీసుకున్నారు. అయితే గతంలో వేరే పార్టీలో ఉన్న తోట వెంకట్రామయ్య వర్గం టీడీపీలో చేరింది. గ్రామంలో రాజకీయ ఆధిపత్యం కోసం వెంకట్రామయ్య ఎంతో కాలంగా ప్రయత్నిస్తున్నారు. అయితే జెవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ ముద్దయ్యకు గ్రామంలో పట్టు ఉంది. ఈ క్రమంలో జెవిశెట్టి సోదరులు ఉన్నంతవరకు గ్రామంలో తన ఆధిపత్యం నడవదని వెంకట్రామయ్య భావించాడు. ఈ క్రమంలోనే సోదరుల హత్యకు పథకం రూపొందించాడని తెలుస్తోంది. దీనికి తోడు రెండు నెలల క్రితం గ్రామానికి చెందిన వెంకట్రామయ్య వర్గీయుడైన ఉప్పుతోళ్ల శ్రీనివాసరావుపై టీడీపీలోనే ఓవర్గం దాడి చేసి కాళ్లు విరగొట్టింది. ఆ దాడికి పాల్పడిన నిందితులకు జెవిశెట్టి వెంకటేశ్వర్లు వర్గం మద్దతుగా నిలిచింది.

గ్రామ పెద్దగా ప్రకటనతో కంటగింపు

రెండు రోజుల క్రితం ఎస్పీ శ్రీనివాసరావు గ్రామంలో పల్లెనిద్రకు వచ్చారు. గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంకటేశ్వర్లును సంప్రదించాలని గ్రామస్థులకు సూచించారు. ఆయా ఇబ్బందులను వెంకటేశ్వర్లు తమ దృష్టికి తీసుకొస్తారని ఆయనను ఎస్పీ గ్రామ పెద్దగా ప్రకటించారు. ఈ క్రమంలో ఎస్పీ ప్రకటన నిందితులకు కంటగింపుగా మారింది. శ్రీనివాసరావు కాళ్లు విరగ్గొట్టడం, ఆపై ఎస్పీ కూడా వెంకటేశ్వర్లను గ్రామస్తులు అనుసరించాలని చెప్పడంతో తోట వెంకట్రామయ్యకు రుచించలేదు. ఈ నేపథ్యంలోనే వెంకటేశ్వర్లు, కోటేశ్వరావులను అడ్డుతొలగిస్తే గ్రామంలో ఎదురుండదని భావించి వారిని హత్య చేశారని సమాచారం.

గ్రామానికి వస్తుండగా కారుతో ఢీకొట్టి..

జెవిశెట్టి వెంకటేశ్వర్లు, సోదరుడు కోటేశ్వరరావు, అల్లుడు తోట ఆంజనేయులుతో పాటు సుమారు 12 మంది ద్విచక్ర వాహనాలపై తెలంగాణలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మిగిలిన వారు మాచర్లలో టీ తాగేందుకు ఆగగా వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై గ్రామానికి వస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న వెంకట్రామయ్య, జెవిశెట్టి శ్రీనివాసరావు, అలియాస్ బొబ్బలితో పాటు మరో ఇద్దరు కారులో గుండ్లపాడు నుంచి మాచర్లకు వచ్చే మార్గంలో ఎదురుగా వెళ్లి భోజనవీడు మండాది గ్రామాల మధ్యలో సోదరులు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో సోదరులు ఎగిరి 100 అడుగుల దూరంలో పడి మృతి చెందారు. ఈ ఘటన జరిగిన పది నిమిషాల తర్వాత వెనుకగా వెంకటేశ్వర్లు అల్లుడు తోట ఆంజనేయులు ద్విచక్ర వాహనంపై రాగా అతడ్ని చూసి నిందితులు కారును అక్కడే వదిలేసి రచ్చమల్లపాడు వెళ్లే డొంక గుండా పారిపోయారు. నిందితుల్లో ఒకడైన జెవిశెట్టి శ్రీనివాసరావు హతులకు పెదనాన్న కొడుకు కావడం గమనార్హం.

పిన్నెల్లి హస్తంపై ఆరోపణలు

వెంకటేశ్వర్లు సోదరుల హత్యలో వైసీపీ వర్గీయులు, ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హస్తం కూడా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంకటేశ్వర్లు సోదరుల హత్యతో టీడీపీలోని ప్రత్యర్థి గ్రూపుతో పాటు గ్రామంలో వైసీపీ ఆధిపత్యానికి కూడా ఎదురుండదనే కారణంతోనే జంట హత్యలు జరిగినట్లు టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి. సోదరుల హత్యలో పిన్నెల్లి పాత్ర ఉందని హతుల కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే సోదరుల కుటుంబంలోని మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. వెంకటేశ్వర్లుకు భార్య అచ్చమ్మ కుమారుడు ఆంజనేయులు, కూతురు అనురాధ ఉన్నారు. కోటేశ్వరరావుకు భార్య గాలమ్మ, కుమారుడు లక్ష్మయ్య ఉన్నారు. సోదరుల హత్య గ్రామంలో విషాదాన్ని మిగిల్చింది. వరుస ఘటనల నేపథ్యంలో గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని సర్వత్రా భయాందోళనలు నెలకొన్నాయి.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

జంట హత్యలు జరిగిన ప్రాంతాన్ని ఎస్పీ కంచె శ్రీనివాసరావు పరిశీలించారు. హత్య జరిగిన కోణాన్ని, వాహనాన్ని, మృతదేహాలను పరిశీలించారు. మాచర్ల పట్టణ సీఐ పచ్చిపాళ్ల ప్రభాకరరావు, వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి, విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి, ఎంవీఐ శేషురెడ్డిల నుంచి సమాచారం సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.



ఎస్పీ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

శాంతిభద్రతలకు పిన్నెల్లి సోదరుల విఘాతం: బ్రహ్మారెడ్డి

హైదరాబాదులో ఉన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జంట హత్యల విషయం తెలుసుకున్న వెంటనే హుటాహుటిన రాత్రికి గ్రామానికి (మిగతా 6వ పేజీలో)

మాటలు కాదు.. ఫలితాలు కావాలి

- బర్లీ పొగాకు కొనుగోళ్లపై కంపెనీలకు ఆదేశాలు
- గ్రేడ్ల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదు
- మార్టూరులో రైతులతో ముఖాముఖిలో మంత్రి అచ్చెన్నాయుడు
- ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదన్న రైతులు
- సాగుకు ముందు ధర ఆశ చూపి కంపెనీలు ఇప్పుడు వంచించాయని ఆగ్రహం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) 'మాటలు కాదు.. ఫలితాలు కావాలి. బర్లీ పొగాకు రైతులకు న్యాయం జరగాలి. ఒక్క రైతు మరణం కూడా జరగకూడదు. ధర ఆశచూపి.. కొనుగోళ్లపై హామీ ఇచ్చి ఇప్పుడు ఎందుకు తప్పుకు తిరుగుతున్నారు. ప్రభుత్వం పదేపదే ఆదేశిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు. లాభాలు వచ్చినప్పుడే కాదు కష్టాల్లోనూ రైతుకు అండగా కంపెనీలు ఉండాల్సిందే. ఏ ఒక్క రైతు కూడా ధర విషయంలో బేలపడి ఉసురు తీసుకునే పరిస్థితి రావద్దు. కంపెనీలు పూర్తి స్థాయిలో బర్లీ పొగాకును కొనాలి. అప్పటికి ఇంకా మిగిలితే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తాం.' అని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పొగాకు కంపెనీలను ఆదేశించారు. బర్లీ పొగాకు రైతుల కష్టనష్టాలపై మంత్రి అచ్చెన్నాయుడి సారథ్యంలో మార్టూరులో శనివారం ముఖాముఖి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తొలుత రైతులు తమ గోడును సబ్‌కమిటీ ఎదుట వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్య తప్ప వేరే మార్గమే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది కంపెనీల ప్రతినిధులు ఇంటింటికి తిరిగి బర్లీ పొగాకు సాగు చేయాలని కోరాయని, ప్రస్తుత సంక్షోభానికి కారణం వారేనని రైతులు వాపోయారు. ధర ఆశ చూపి నిలువునా వంచించాయంటూ జీపీఐ కంపెనీ వ్యవహారశైలిపై మండిపడ్డారు. సాగు చేసేటప్పుడు ఓ మాట ఇప్పుడు ఓ మాట మాట్లాడుతున్నారని, ఏజెంట్లు కనీసం తమ ఫోన్లు కూడా ఎత్తడం లేదన్నారు.



ధర దక్కడం లేదని నేతలకు గోడు వెళ్లబోసుకుంటున్న మహిళా రైతు

మొత్తం కొనాల్సిందే...

సమావేశానికి హాజరైన కంపెనీల ప్రతినిధులు తాము కొనబోయే గణాంకాలను చెబుతున్న క్రమంలో ఇప్పటి వరకు ఎంత కొన్నారని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. రైతుల్లో భరోసా నింపాల్సిందేనని దానికి ఏం చేయగలరో చెప్పండని నిలదీశారు. జీపీఐ 15,000 మిలియన్ కేజీల పొగాకు, ఐటీసీ 8,000 మిలియన్ కేజీల కొనుగోలుకు సుముఖత వ్యక్తం చేయడంతో మిగిలినది ఎవరు కొంటారని ఆయన ప్రశ్నించారు. రైతుల దగ్గర ఉన్న నిల్వలు 70,000 మిలియన్ కేజీలని గణాంకాలు చెబుతుంటే ఈ కోతల లెక్కలెందుకని మంత్రి ప్రశ్నించారు. చివరి ఆకు వరకు కొనాల్సిందేనని, అందుకు ప్రభుత్వం నుంచి కావాల్సిన సహాయం ఏమిటో కూడా చెప్పాలన్నారు.



పొగాకు రైతుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ఏలూరి

ధర విషయంలో ఏలూరి ప్రతిపాదన

రైతులు గ్రేడ్లు చేసే పరిస్థితిలో లేరని కొనుగోలులో రెండే ప్రామాణికాలు ఉండేలా చూడాలని సమావేశా నికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు ప్రతిపాదించారు. లో గ్రేడ్ రకానికి రూ. 5,000 నుంచి రూ.6,000, మీడియం, హై క్వాలిటీ రకానికి రూ.12,000 ధర ఇచ్చేలా చూడాలని మంత్రి ని ఏలూరి కోరారు. పొగాకు సాగును భవిష్యత్తులో అయినా రెగ్యులరేట్ చేయడానికి ఓ సెల్ఫ్ మా నిటరింగ్ బోర్డు ఉండేలా చొరవ తీసుకోవాలన్నారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమను నేరుగా రైతుల వద్దకే వెళ్లి వారి సమస్యలు విని భరోసా కల్పించే చర్యలు తీసుకోవాలని చెప్పారన్నారు. సమావేశంలో వ్యవ సాయ శాఖ కమిషనర్ డిల్లీరావు, ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, టుబాకో బోర్డు ఛైర్మన్ యశ్వంత్, ఏడీ విశ్వనే, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ సురేష్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, కలెక్టర్ వెంకటమురళి,అధికారులు, పొగాకు కంపెనీల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.

31న జడ్పీస్థాయి సంఘం సమావేశాలు

గుంటూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్తు స్థాయి సంఘం సమా వేశాలు ఈ నెల 31వ తేదీన ఛైర్‌పర్సన్ కత్తెర హెని క్రిష్టిన అధ్యక్షతన జరుగుతాయని సీఈవో జ్యోతిబసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే శనివారం ఉదయం 10.30 గంటల నుంచి 1, 2, 4, 7 స్థాయి సంఘాల సమావేశాలు ఛైర్‌పర్సన్ అధ్యక్షతన, 3వ స్థాయి సంఘం సమావేశం శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, 5వ స్థాయి సంఘం సమావేశం పిల్లి ఉమా ప్రణతి, 6వ సమావేశం బత్తుల అనురాధ అధ్యక్షతన జరుగుతాయని పేర్కొన్నారు. సభ్యులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.



కాంస్య పతకం పొందిన ముఖేష్

ముఖేష్..షూటింగ్‌లో భేష్..!

● గుంటూరు వాసి మరో రికార్డు ● జర్మనీలో జూనియర్ వరల్డ్ కప్ పోటీల్లో కాంస్యం ● గతేడాది కూడా ఐదు పతకాలతో సత్తా..

గుంటూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ షూటింగ్ క్రీడాకారుడు.. గుంటూరు నగరానికి చెందిన నేలవల్లి ముఖేష్ మరో ప్రపంచ రికార్డు సాధించాడు. జర్మనీలో శనివారం జరిగిన వరల్డ్ కప్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించి.. జిల్లా ప్రతిష్ఠను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారు. జర్మనీలోని షూల్‌లో జరుగుతున్న ఈ ప్రపంచకప్ పోటీల్లో ముఖేష్ 25 మీటర్ల రాపిడ్ ఫెయిర్ పిస్టల్ విభాగంలో భారత దేశానికి ప్రాతినిథ్యం వహించాడు. రిలేలో 600 కు 573 పాయింట్లతో 6వ స్థానంలో నిలిచాడు. ఫైనల్ పోరులో ఫ్రాన్స్‌కు చెందిన చినోర్స్ థామస్ క్లిమెంట్ బంగారు పతకం గెలవగా, పోలాండ్‌కు చెందిన కోపీవోద విక్టర్ లోకస్ట్ రజతం గెలిచాడు. మూడో స్థానంలో నిలిచిన ముఖేష్ కు కాంస్య పతకం లభించింది.

గతేడాది పెరూలో..

గతేడాది నవంబరులో పెరు దేశంలోని లిమా లో జరిగిన ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన ముఖేష్ రికార్డు స్థాయిలో 5 స్వర్ణాలు, రెండు కాంస్య పతకాలు గెలిచాడు. నాలుగేళ్లుగా జాతీయ స్థాయిలో ముఖేష్ 50కి పైగా పతకాలు సాధించాడు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో 2019 నుంచి గతేడాది వరకు వరుసగా ఆంధ్ర రాష్ట్రానికి బంగారు, వెండి, కాంస్య పతకాలను అందించాడు. ఈ ఏడాది యూనివర్సిటీ గేమ్స్‌లో కేఎల్ యూనివర్సిటీ నుంచి ప్రాతినిథ్యం వహించిన ముఖేష్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో రజతం, 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకం గెలిచాడు. ఆగస్టులో కజకిస్థాన్‌లో జరగనున్న ఏషియన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కూడా ముఖేష్ భారతదేశానికి ప్రాతినిథ్యం వహించనున్నాడు. అలాగే జాతీయ స్థాయిలో 2022లో భోపాల్‌లో జరిగిన నేషనల్ రైఫిల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించి, కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు.

గురువు శిక్షణ.. తల్లిదండ్రుల ప్రోత్సాహం

గుంటూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్‌లో ముఖేష్ శిక్షణ పొంది.. అక్కడ చీఫ్ కోచ్ ఎన్ సుబ్రమణ్యేశ్వరరావు మార్గదర్శకత్వంలో తన ప్రతిభకు మరింత పదును పెట్టాడు. ముఖేష్ తండ్రి శ్రీనివాస్ గుంటూరులో న్యాయవాదిగా పేరొందారు. తల్లి మాధవి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయరాలుగా పనిచేస్తున్నారు. ముఖేష్ ప్రస్తుతం కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ మూడో సంవత్సరం చదవుతున్నాడు.

స్వగ్రామానికి రోడ్డు ప్రమాద మృతదేహాలు

బాపట్ల, గిద్దలూరు, మే24 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కొమరవోలు గ్రామంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామానికి చెందిన ఆరుగురు దుర్మరణం చెందారు. గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యాధికారులు పోస్టుమార్టం పూర్తి చేసి, మృతదేహాలను పోలీసులు బంధువులకు అప్పజెప్పారు. 3 అంబులెన్స్‌లలో మృతదేహాలను స్వగ్రామం తీసుకుని వచ్చారు. మార్కాపురం డీఎస్పీ యూ.నాగరాజు, రూరల్ సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు పర్యవేక్షించారు. స్టూవర్టుపురం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. నాలుగు కుటుంబాలకు చెందిన ఆరుగురు మృతి చెందడంతో గ్రామమంతా శోక సంద్రమైంది. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మృతదేహాలను సందర్శించి, నివాళులర్పించారు.

కారు ఢీకొని ఒకరు మృతి

నరసరావుపేట రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారి పై నరసరావుపేట - జొన్నలగడ్డ గ్రామాల మధ్యలో శుక్రవారం రాత్రి ఆటోను కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో నరసరావుపేట పట్టణంలోని క్రిస్టియన్‌పాలేనికి చెందిన గోళ్లమూడి దయాకర్ (52) తీవ్రంగా గాయపడి అక్కడి కక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతిడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

వేగం.. ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

చేసుకోవచ్చు. అత్యంత అప్రమత్తంగా నియమాలకు అనుగుణంగా ఉండాల్సిన ప్రయాణం కొద్దిపాటి నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఒకరి నిర్లక్ష్యం అన్నెం, పున్నెం ఎరుగని ఇతరుల ప్రాణాలు పోవడానికి కారణమవుతుంది. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయేవారు కొందరైతే అవయువాలు కోల్పోయి విగత జీవులుగా మారుతున్న వారు ఎందరో ఉంటున్నారు. రోడ్డు ప్రమాదాలపై ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన వాహనదారుల తీరులో మార్పు కనబడటం లేదు. గత కొంత కాలంగా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా పెరిగాయి. మృతుల్లో ఎక్కువ మంది యువకులే ఉండటం మరింత ఆందోళన కల్గించే విషయం. ఏటా రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతుల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. దీనికి తోడు ఏడాదిలో 3 శాతం ప్రమాదాలు తగ్గించాలని పెట్టుకున్న లక్ష్యాలు ప్రణాళికలకు మాత్రమే పరిమితమయ్యాయి.

అర్బన్‌లోనే అత్యధికం

రోడ్డు ప్రమాదాల, మృతుల విషయంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో నమోదైన గణాంకాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. మృతుల్లో మూడో వంతు అర్బన్ పరిధిలో ఉంటున్నాయి. సిబ్బంది పరంగా కొరత లేనప్పటికి ఈ స్థాయిలో ప్రమాదాలు జరగడం అంతు చిక్కని ప్రశ్నగా మారింది. ప్రధానంగా గుంటూరు నగరం, ఇతర ప్రధాన పట్టణాల్లో యువత బైక్ రేసింగ్‌లు ఎక్కువ అవుతున్నా వాటిపై నిఘా కొరవడిందని.. అందువల్లే ప్రమాదాలు, మరణాలు ఎక్కువ జరుగుతున్నాయని తెలుస్తోంది. కళాశాలలు అధికంగా ఉండటం వల్లే యువత బైక్ ప్రమాదాల బారిన పడుతున్నారని అధికారులు చెబుతున్నా నివారణ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నామమాత్రపు తనిఖీలు, కొద్దిపాటి జరిమానాలు, తూతుమంత్రపు కౌన్సిలింగ్ వంటి చర్యలతో ఫలితాలు లేవని రుజువు అవుతున్నా అధికారుల్లో చలనం ఉండటంలేదు.

మనకేందుకులే అనే ధోరణి

ప్రమాదం జరిగినప్పుడు చూసిన వ్యక్తులు సమాచారం ఇవ్వడానికి ముందుకు రాకపోవడం కూడా మృతుల సంఖ్య పెరగడానికి మరో కారణం. ప్రమాదం జరిగిన తొలిగంటలో సమాచారం ఇస్తే 70 శాతం వరకు ప్రాణాలను కాపాడవచ్చు. దీనిని గోల్డెన్ అవర్ అని అంటారు. అయితే ప్రమాద సమాచారం ఇస్తే చట్టపరంగా ఏమైనా ఇబ్బందులు వస్తాయనే భయం, మనకేందుకులే అనే ధోరణి పలువురిలో ఇప్పటికీ ఉంది. ప్రమాద సమాచారం ఇచ్చిన వారికి రూ.5 వేలు నజరానా, ప్రశంసాపత్రం, చట్టప్రకారం ఇబ్బందులు లేకుండా చూడటం వంటి నియమాలు అందుబాటులోకి వచ్చినా ఎవరూ ముందుకు రావడం లేదు.

క్షతగాత్రుల వేదన చూసి మార్పు

రోడ్డు ప్రమాదంలో సభ్యుడిని కోల్పోయి ఆ కుటుంబం ఎంత మానసిక వేదనకు గురవుతుందనే విషయంపై జర్మనీలో విద్యార్థులను ఆయా కుటుంబాల వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విద్యార్థులు, యువతకు ట్రాఫిక్ రూల్స్ నేర్పడంతో పాటు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రమాదాలను నివారించవచ్చనేది వారి నమ్మకం. ఈ విధానం ద్వారా జర్మనీలో కొంత మేరకు ఫలితాలు సాధించారు.

తనిఖీలు ముమ్మరం చేస్తాం



ప్రమాదాలు, మృతులు పెరగడం ఆందోళన కలిగించే విషయం. ఇకపై తనిఖీలు ముమ్మరం చేస్తాం. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ తనిఖీలు చేపడతాం. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చర్యలు తప్పవు. ఈ ఏడాదిలో ప్రమాదాల గణంకాలు తక్కువ నమోదుకు కృషి చేస్తాం.

- కే సీతారామిరెడ్డి, గుంటూరు జిల్లా ఉప రవాణ కమిషనర్

తల్లిదండ్రుల భాగస్వామ్యం ముఖ్యం



మైనర్లకు వాహనాలు ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరించాలి. ముఖ్యంగా ఎక్కువ సీసీ సామర్థ్యం ఉన్న బైక్‌లు, కార్లు వారికి అందుబాటులో ఉంచకూడదు. తల్లిదండ్రుల భాగస్వామ్యం లేనిదే వీటి నివారణ పూర్తి స్థాయిలో సాధ్యం కాదు. ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయాలి.

- కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ

కిమ్స్‌లో మెకానిల్ థ్రాంబెక్టమీ సర్జరీలు

● పక్షవాత రోగులకు మెరుగైన వైద్యచికిత్సలు



మాట్లాడుతున్న వైద్యులు ప్రదీప్‌రెడ్డి, వివేక్, లక్ష్మణ్

గుంటూరు మెడికల్, మే 24 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన పక్షవాత రోగులకు కిమ్స్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక వైద్యచికిత్సలైన మెకానికల్ థ్రాంబెక్టమీ ప్రొసీజర్‌ను అందుబాట్లోకి తెచ్చినట్లు న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్‌రావు తెలిపారు. శనివారం మంగళదాస్ నగర్‌లోని కిమ్స్ హాస్పిటల్స్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, న్యూరో ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ వివేక్ లంకాతో కలసి ఆయన మాటాడారు. పక్షవాతానికి గురైన మొదటి నాలుగు గంటల్లో రోగులకు ఈ చికిత్స అందించడం ద్వారా ప్రాణహాని నుంచి కాపాడటంతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయవచ్చని డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. రోగి మెదడులో రక్తం గడ్డ కట్టడం వల్ల ఇస్కీమిక్ స్ట్రోక్ సంభవిస్తుందని, యాంజియోగ్రామ్ ద్వారా సూక్ష్మమైన కెథెడర్ అనే పరికరం పంపి మెదడు రక్తనాళాలల్లో పూడికలను తొలగించడమే మెకానికల్ థ్రాంబెక్టమీ అని ఆయన తెలిపారు. గతంలో మందుల ద్వారా రక్తనాళాల్లో పూడికలను కరిగించే వారని, ఇందుకు కొంత సమయం పట్టేదని ఆయన వివరించారు. , దీని వల్ల రోగులు కోలుకునేందుకు కొంత సమయం పట్టడంతో పాటు శారీరక వైకల్యం ఏర్పడే ప్రమాదం ఉండేదన్నారు. అత్యాధునిక మెకానికల్ థ్రాంబెక్టమీతో మెదడు రక్తనాళాల్లో పూడికలు వెంటనే తొలగించడం వల్ల రక్తసరఫరా పునరుద్ధరిస్తామని, ఫలితంగా రోగులు వేగంగా కోలుకుంటారని ఆయన వెల్లడించారు. ఈ నెల 19వ తేదీన నర్సరావుపేటకు చెందిన ఆటోడ్రైవర్ (45) ఇస్కీమిక్ పక్షవాతం బారిన పడగా, కిమ్స్ హాస్పిటల్స్‌లో ఎక్యూట్ న్యూరలాజికల్ ఎమర్జెన్సీ వైద్య బృందం అతడికి థ్రాంబెక్టమీ చికిత్సలు అందించినట్లు న్యూరో సర్జన్ డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. వారం రోజుల్లోనే బాధితుడు పూర్తిగా కోలుకున్నట్లు చెప్పారు.

ఆధిపత్య పోరులో.. జంట హత్యలు

(5వ పేజీ తరువాయి)


హత్యకు ఉపయోగించిన స్కార్పియో

వచ్చారు. హతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో స్వల్ప వివాదాలను ఆసరాగా తీసుకుని పిన్నెల్లి సోదరులు రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. వివిధ మండలాల్లో వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టి కవ్వింపు చర్యలకు పాల్పడేటట్లు చేస్తున్నారన్నారు. గ్రామాలు అభివృద్ధి పరచాలని నేను ప్రయత్నిస్తుంటే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డిలు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. జంట హత్యల్లో కూడా వారి హస్తం ఉందని, దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. పోలింగ్ ముందు, పోలింగ్ తర్వాత అల్లర్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసు వ్యవస్థ విఫలమైందని, అందువల్లే సంఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆరోపించారు. మా పార్టీ కార్యకర్తలను మందలిస్తున్నానని, ప్రతిపక్షం వారు రెచ్చగొడుతున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో పోలీసు వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలన్నారు.


ప్రత్యక్ష సాక్షి ఆంజనేయులును విచారిస్తున్న ఎస్ఐ మహ్మద్‌షఫి

రూ. 1.97 కోట్ల సిగరెట్లు సీజ్

● ఏపీ జీఎస్టీ, విజిలెన్స్ మూకుమ్మడి దాడులు

● అనుమతి లేని సిగరెట్లు, డిష్‌వాష్ సబ్బులు స్వాధీనం

గుంటూరు సిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో భారీ మోతాదులో అనుమతి లేని సిగరెట్‌లు, డిష్‌వాష్ సబ్బులను ఏపీ జీఎస్‌టీ అధికారులు విజిలెన్స్‌తో సమన్వయంతో సీజ్ చేశారు. బుడంపాడు సమీపంలోని అన్నపూర్ణ కమర్షియల్ కాంప్లెక్స్‌లో షాప్ నంబర్ 33 లో బిహార్‌లోని పాట్నా నుంచి అక్రమంగా లారీలో తీసుకువచ్చి దిగుమతి చేసుకుంటున్న సిగరెట్‌లను రెండు శాఖల అధికారులు పట్టుకొన్నారు. వాటిని పరిశీలించగా ఏ విధమైన అనుమతి లేకుండానే రవాణ చేసి తీసుకొచ్చినట్లు గుర్తించారు. జీటీపీఎల్ స్టైప్, విమల్ బ్రాండ్ పేరుతో ఈ సిగరెట్లు ఉన్నాయి. మొత్తం 206 బేల్స్‌లో ప్యాకింగ్ చేసి తీసుకొచ్చారు. ఒక్కో బేల్‌లో రెండు కార్టన్స్ ఉండగా.. ఒక్కో కార్టన్‌లో 60 బాక్సులున్నాయి. అనుమతి లేకుండా రవాణ కాబడిన వాటి విలువ రూ. 1,97,76,000 గా లెక్కించారు. అలానే జంక్ బ్రాండ్ పేరుతో డిష్‌వాష్ సబ్బులు 265 కార్టన్లను దిగుమతి చేశారు. ఒక్కో కార్టన్‌లో 12 సబ్బులుండగా వాటిపై ఎంఆర్‌పీ రూ.55గా ఉంది. వీటి విలువ రూ. 1,74, 900గా లెక్కించారు. వీటి ఇన్‌వాయిస్, ఈవే బిల్లు ఈ నెల 17న జనరేట్ చేశారు. గొడీయమటం రోడ్డులో చిరునామాతో ఇన్‌వాయిస్ జనరేట్ చేసి బుడంపాడు బైపాసు రోడ్డులోని అన్నపూర్ణ కమర్షియల్ కాంప్లెక్స్‌లో దిగుమతి చేశారు. ఈ మొత్తం స్టాక్ బిహార్ నుంచి సుబాష్ అనే వ్యక్తి గుంటూరు నగరానికి చెందిన సూర వెంకటేశ్వరరావు అలియాస్ వెంకట్ అనే వ్యక్తికి సరఫరా చేస్తున్నట్లుగా నిర్ధారణ అయ్యిందని విజిలెన్స్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సీజ్ చేసిన సిగరెట్లు, సబ్బులను పౌరసరఫరాల శాఖ గుంటూరు తూర్పు డిప్యూటీ తహసీల్దార్ బి.భాస్కర్‌కు అందజేశారు. ఏపీ జీఎస్‌టీ, సీవోటీపీఏ 2003 చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు వివరాలను రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ అహ్మద్‌బాబుకు ఇక్కడి ఏపీజీఎస్‌టీ అధికారులు నివేదించారు.

సాగర్ సమాచారం

విజయపురిసౌత్, మే 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 512.50 అడుగులు ఉంది. ఇది 135.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5598 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 6498 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

బగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న పనబాక లక్ష్మి



పనబాక లక్ష్మికి అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, మే24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి కేంద్ర మాజీ మంత్రి, తిరుమల-తిరుపతి దేవస్థానం సభ్యులు డాక్టర్ పనబాక లక్ష్మి శనివారం ఉదయం విచ్చేసి కుటుంబ సభ్యులు, పలువురు టీడీపీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి వారిని మర్యాదపూర్వకంగా ఆలయానికి ఆహ్వానించి పూజలు నిర్వహించారు. శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయ విశేషాలు గురించి తెలియజేశారు. ప్రసిద్ధిగాంచిన ఆలయమని గతంలో విన్నానని ఆమె తెలిపారు. ఆలయానికి సంబంధించి మాస్టర్ ప్లాన్ తయారు చేసుకొని తమ వద్దకువచ్చిన యెడల టీటీడీ పాలకమండలిలో ఈ అంశంపై ప్రస్తావిస్తానని తెలిపారు. పనబాక లక్ష్మికి వేద ఆశీర్వచనాలు అందజేసి దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పిట్టలవానిపాలెం మండలాధ్యక్షుడు ఎండీ అఫ్జల్, బాపట్ల పట్టణ టీడీపీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, భవనంవారిపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు కలకోట చక్రధర్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు మద్దాల డేవిడ్, టీడీపీ సీనియర్ నాయకుడు భవనం బసివిరెడ్డి, ఖాజీపాలెం మాజీ సర్పంచ్ మంతెన రామచంద్రరాజు, అరీఫ్, లేళ్ళ వెంకటప్పయ్య, ఆలయ సిబ్బంది కె.శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు భక్తులు సమర్పించిన చీరల వేలం పాట

శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు బహిరంగ వేలం పాట ఆదివారం ఉదయం 10 గంటలు నుంచి జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. బాపట్ల డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఈవేలం పాట జరుగుతుందని ఆసక్తి కలిగిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సముద్రతీరంలో నిఘానేత్రం

- యాత్రీకుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యం
- ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : యాత్రీకుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సముద్రతీరప్రాంతాలలో నిఘానేత్రం ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. సూర్యలంక సముద్రతీరంలో నిఘా కోసం డ్రోన్‌లను ఉపయోగిస్తున్నామని ఆయన చెప్పారు. జిల్లాలోని సూర్యలంక, రామాపురం, ఓడరేవు సముద్రతీరాలలో శనివారం డ్రోన్‌లను ఎగురవేసి పరిసరాలను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ తీరప్రాంతాలకు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా అనేక ప్రాంతాలు నుంచి యాత్రీకులు వస్తుంటారన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావున యాత్రీకులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. యాత్రీకులు సముద్రలోతుల్లోకి వెళ్ళకుండా డ్రోన్‌లు ఎగురవేసి వాటి ద్వారా గుర్తించటం జరుగుతుందన్నారు. ఎవరైనా ప్రమాదానికి గురైతే వెంటనే గజ ఈతగాళ్ళు, ఔట్ పోస్ట్, మెరైన్ పోలీసులను అప్రమత్తం చేసి వారిని కాపాడటం జరుగుతుందన్నారు. యాత్రీకులకు, మహిళలకు అసౌకర్యం కలిగించే ఆకతాయిలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సముద్రతీర పరిసర ప్రాంతాలలో అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేసేందుకు డ్రోన్‌లను వినియోగిస్తున్నామని తెలిపారు. యాత్రికులు పోలీసు శాఖ సూచనలు పాటిస్తూ ఆహ్లాదకరంగా గడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. పోలీసుశాఖ చేసే సూచనలు యాత్రీకుల రక్షణ కోసమని గ్రహించి సహకరించాలన్నారు.



పర్యాటకుల భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

తహసీల్దార్ బంగ్లా స్థలం శుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బాపట్ల,మే24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక ఉప్పరపాలెం వెళ్ళేరోడ్డు పక్కనే 'వ్యర్థాలతో నిండి దుర్గంధ పూరితంగా మారిన తహసీల్దార్ బంగ్లా స్థలం' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. ప్రధాన రహదారి పక్కనే విలువైన ఈ స్థలం ఇక్కడ ఉందనే విషయం కూడా అధికారులకు తెలియకపోవటం గమనార్హమంటూ వెలువడిన కథనంతో జిల్లా అధికారులు స్పందించి మున్సిపల్, రెవెన్యూఅధికారులను వెంటనే శుభ్రం చేసి స్వాధీనం పర్చుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, శానిటరి సిబ్బందితో అందులో ఉన్న వ్యర్థాలు మొత్తం బయటకు తరలించారు. ముళ్ళచెట్లు, పొదలు, పిచ్చిమొక్కలు జేసీబీతో తీయించి శుభ్రం చేయించారు. ఈ స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయ అవసరాలకు వినియోగించనున్నట్లు పేర్కొంటున్నారు. ఈవిధంగా 'ఆంధ్రజ్యోతి' కథనంతో అధికారులు స్థలాన్ని శుభ్రం చేయటంతో అటు బాలికాసదన్, ఇటు స్కౌట్ భవనం చుట్టుపక్కల ప్రజలకు దుర్గంధం నుంచి విముక్తి లభించింది.



శుభ్రం చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

డ్రెయినేజిలో పూడికతీత పనులు పరిశీలించిన కమిషనర్

బాపట్ల, మే24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మచ్చావారిపాలెంలో చేపట్టిన డ్రెయినేజి పూడిక తీత పనులను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి శనివారం పరిశీలించారు. డ్రెయినేజిలలో అధికంగా పేరుకుపోయిన గుర్రపుడెక్కను కూడా తొలిగించాలని కమిషనర్‌ను ఆదేశించారు. శానిటరి సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించి డ్రెయినేజి పూడికతీత పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే సూర్యలంక రోడ్డులోని వ్యవసాయ కళాశాల దగ్గర చేపట్టిన డ్రెయినేజి పూడిక పనులను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ఉప్పరపాలెం రోడ్డులోని తహసీల్దార్ బంగ్లా స్థలం శుభ్రం చేసే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెలు ప్రశాంతంగా ఉండాలి : చందోలు ఎస్ఐ

పిట్టలవానిపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగుపాలెం గ్రామంలో చందోలు ఎస్ఐ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని స్టేషన్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ మండలంలో గ్రామస్తులు పార్టీలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో ఉండాలని, గొడవలు లేని గ్రామాలలో ఒకటి సంగుపాలెం గ్రామంగా గుర్తించామని, ఈ గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొని ఉందన్నారు. గ్రామంలో ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్‌సోపాటి, సంగుపాలెం గ్రామ సర్పంచ్ ఎనికేపల్లి శివకుమారి, ఎంపీటీసీలు చెన్నుబోయన గంగయ్య, గ్రామ యువకులు, టీడీపీ నాయకులు బర్నా, జాన్‌బాబు పాల్గొన్నారు.

జగన్ అవినీతి చరిత్ర ప్రపంచానికి తెలుసు : కొల్లా

బాపట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అవినీతి చరిత్ర ప్రపంచానికి తెలుసు అని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మద్యం ముడుపుల డాన్ చంద్రబాబేనని, ఆయన లిక్కర్ కేసులో కండీషన్ బెయిల్‌పై ఉన్నారని మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించటం అతని అబద్దాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. జగన్ సీఎం కాకముందే తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని అతి తక్కువ సమయంలో వేల కోట్ల అవినీతికి పాల్పడి అక్రమాస్తులు సంపాదించటంలో ఎన్ని కుట్రలకు పాల్పడ్డారో విదేశీ యూనివర్సిటీలో విద్యార్థులకు ఓ స్టడీ కేసుగా బోధించబడిందన్నారు. దీనిని బట్టి జగన్ ఆర్థిక నేరాలు ప్రపంచానికి ఏనాడో చాటబడ్డాయన్నారు. దేవుడు పై నుంచి చూస్తున్నాడంటూ నిరాశ, నిస్పృహలతో మాట్లాడటం అతని రాజకీయ అంతిమ గడియలకు నిదర్శనమన్నారు.

పాఠశాల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ హైస్కూల్ భవన నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులకు సూచించారు. ఆయన శనివారం అధికారులు, నాయకులతో కలిసి రూ.కోటి 48 లక్షలతో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 30 తరగతి గదులు ఉండేవిధంగా మూడు అంతస్థుల భవనం నిర్మించటం జరిగిందన్నారు. నిర్మాణ పనులు పూర్తికాక ముందే వైసీపీ అధికారంలోకి వచ్చి దీనిని నిర్లక్ష్యం చేయటం జరిగిందన్నారు. 5 సంవత్సరాలు తర్వాత స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భవనాన్ని పరిశీలించి నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. నిర్మాణ పనులు ప్రారంభించటం జరిగిందని విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి తరగతి గదులు పూర్తి చేసి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చూడాలన్నారు. అధికారులు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులు పూర్తి చేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్షాభియాన్ డైరెక్టర్ నాగిరెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.



నూతన భవన అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

కళ్ళఎదుటే కన్నతల్లి మృతి

- చలించిపోయిన పసిహృదయాలు



భవానీ (ఫైల్)



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మొగిలి జీవన్, శిరీష

బాపట్ల, మే24 (ఆంధ్రజ్యోతి) : కళ్ళెదుటే కన్నతల్లి మృత్యువాత పడిన సంఘటన చూసిన ఆ పసి హృదయాలు చలించిపోయాయి. ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైన వెంటనే పెద్దఎత్తున శబ్దం.. ఏమి జరిగిందో తెలియదు.. అప్పటి వరకు కారులో ఉన్న ఆ కుటుంబ సభ్యులు అదే కారులో ఇరుక్కొని పడిపోయి ఉన్నారు. భయంతో ఆచిన్నారులు వణికిపోయారు. అమ్మా...అమ్మా....అంటూ ఆ చిన్నారులు ఏడుస్తూ మృత్యుఒడికి చేరిన తల్లిని లేపే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవటంతో పక్కనే పడి ఉన్న అమ్మమ్మను లేపారు. ఆమె నుంచి కూడా స్పందన లేకుండాపోయింది. కారులో ఉన్న మిగతావాళ్ళు అంతా రక్తపుమడుగులో ఉలుకుపలుకులేకుండా పడి ఉన్న దృశ్యాన్ని చూసిన ఆచిన్నారులు పెద్దఎత్తున కేకలు వేస్తూ రోధించారు. ప్రమాదం జరిగిన కొద్దిసేపటికి అక్కడి స్థానికులు ఇరువురు చిన్నారులను బయటకు తీసుకొచ్చారు. మొత్తం ఆరుగురు వ్యక్తులు సంఘటనలో మృతి చెందారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇద్దరు చిన్నారులు మాత్రం వెనుక సీటులో కూర్చొని ఉన్నారు. ముందు సీట్‌లో కూర్చోన్న ఆరుగురు వ్యక్తులు ఈ సంఘటనలో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ప్రకాశం జిల్లా కొమరవోలులో జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో బయటపడిన జీవన్, శిరీష చిన్నారుల దయనీయ దీనగాధ పలువురిని కలిసి వేస్తుంది. ఆ చిన్నారుల తల్లి మొగిలి భవానీ, అమ్మమ్మ అంకాలు, మేనమామ నరసింహ దుర్మరణం చెందారు. రోడ్డుప్రమాదంలో మృత్యువాతపడిన ఆరుగురు వ్యక్తుల అంత్యక్రియలు వారి స్వగృహమైన బాపట్ల మండలం స్టూవర్టుపురంలో శనివారం జరిగాయి.

మద్యపానంతో దెబ్బతింటున్న కుటుంబాలు

- ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయ

బాపట్ల,మే24 (ఆంధ్రజ్యోతి) : మద్యపాన వ్యసనం వల్ల వ్యక్తులు, కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక ఇబ్బందులను గ్రహించాలని ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ తెలిపారు. మండలంలోని గాదె వెంకటరెడ్డి నగర్‌లో శనివారం కమిటీ ఫర్ ఆల్కాహాల్ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విజయ ముఖ్యఅతిథిగా పాల్గొని కరపత్రాల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ ఎన్.మోషెస్‌కుమార్, డీఎంవో ఎం.గోపినాథ్, ఎ.శ్రీనివాసరావు, ఐవీ బ్రహ్మం, జి.అజంతా రాణి, బి.ఇందిరా, పి.శ్రీమన్నారాయణ, డి.ప్రభుదాసు, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలియజేయాలి : డీఆర్వో

బాపట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్ రాజకీయ పార్టీల నాయకులను కోరారు. ఈ విషయమై శనివారం డీఆర్‌వో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో ఓట్ల సంఖ్య అందులో మార్పులు, చేర్పులు గురించి చర్చించారు. ముఖ్యంగా వచ్చిన దరఖాస్తులు గురించి వివరించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, బీజేపీ నాయకుడు రామకృష్ణ, సీపీఎం నాయకుడు నూతలపాటి కోటేశ్వరరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఆట్ల బాలాజిరెడ్డి, బహుజన సమాజ పార్టీ నాయకులు డాక్టర్ గుదే రాజారావు, కాగిత కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు దోనేపూడి రవి, సీఐటీయూ నాయకులు శరత్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ చాంఫియన్‌కు అభినందనలు

బాపట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ కూడో చాంఫియన్‌షిప్ పోటీలలో బాపట్లకు చెందిన దివ్యతేజ విజేతగా నిలిచి గోల్డ్‌మెడల్ సాధించారు. మహారాష్ట్రలోని పూణెలో ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకు జరిగిన మూడో నేషనల్ కూడో చాంఫియన్‌షిప్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన దివ్యతేజకు గోల్డ్‌మెడల్ రావటం అభినందనీయమని మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. ఈవిధంగా గోల్డ్‌మెడల్ సాధించిన దివ్యతేజకు శనివారం ఆయన మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, సెక్రటరి షేక్ కరీముల్లా, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సుంకర శేషగిరిరావు, తోట దుర్గారావు, అబ్దుల్ రజాక్, కె.ఆంజనేయులు, వల్లూరి భావన్నారాయణ, పసుపులేటి ప్రసాద్, డి.వెంకటేశ్వర్లు, రాంప్రసాద్‌రెడ్డి, బసివి రెడ్డి, అడే కిషోర్, అడే రాఘవాదేవి తదితరులు ఉన్నారు.



బాధితునికి ఆర్థికసాయం అందిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

గృహం కోల్పోయిన వారికి ఆర్థికసాయం

రేపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 26వ వార్డులో నివాసం ఉంటున్న కొలుసు సాంబశివరావు గృహం విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుని అండగా నిలవాలని సూచించారు. సాంబశివరావుకు శనివారం ఆర్థిక సాయాన్ని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అందించారు. ప్రభుత్వం ద్వారా పక్కా గృహన్ని నిర్మించుకునేందుకు ఇంటిని మంజూరు చేయిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గోగినేని పట్టాభిరామారావు, డొక్కు బుజ్జి, డొక్కు గోపి, షేక్ జమీర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టితోనే పంచాయతీలకు మహర్దశ

నగరం, మే 24 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద సృష్టించటం ద్వారానే పంచాయతీలకు మహర్దశ పడుతుందని మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. నగరం మండలంలోని నాలుగు పంచాయలు దూళిపూడి నార్త్, తోటపల్లి, జిల్లేపల్లి, పెద్దవరం గ్రామాలలో శనివారం ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సదుపాయాలను సమకూరుస్తామని ఆయన అన్నారు. చెత్తనుంచి సంపద సృష్టించటం ద్వారా పంచాయతీలకు ఆదాయ వనరులు చేకూరుతాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన యార్డు డైరెక్టర్ కుటుంబరావు

కొల్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును యార్డు డైరెక్టర్‌గా ఎంపికైన పోతార్లంక కుటుంబరావు దుశ్శాలువా, పుష్పగుచ్చాలతో సత్కరించారు. కొల్లూరుకు చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త కుటుంబరావు వేమూరు మార్కెట్ యార్డు కమిటీ మెంబర్‌గా తనను నియమించిన ఎమ్మెల్యేను గుంటూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం తన కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్చాలు అందించి దుశ్శాలువాతో సత్కరించారు.



ఎమ్మెల్యే ఆనందబాబును సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న యార్డు డైరెక్టర్ కుటుంబరావు

శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న ఆర్డీవో



శ్రీబగళాముఖి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సహాయకుడు కె.శ్రీనివాసరావు తదితరులు

పిట్టలవానిపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి శనివారం రేపల్లె ఆర్డీవో రామలక్ష్మీ తమ కుటుంబ సభ్యులతో విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ సీనియర్ సహాయకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు ందజేశారు. ఈ సందర్భంగా రేపల్లె ఆర్డీవో రామలక్ష్మీని దుశ్శాలువాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటంను అందజేశారు. శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయ విశిష్ఠ గురించి ఆలయ సీనియర్ సహయకులు కె.శ్రీనివారావు ఆర్డీవో రామలక్ష్మీకి వివరించారు. ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, చందోలు-1సచివాలయ వీఆర్వో అరుణ ప్రసన్న పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా రేషన్ పంపిణీ చేయాలి



రేపల్లెలో రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణ, గ్రామాల్లో నిబంధనలకు అనుగుణంగా రేషన్ సరుకులను పంపిణీ చేయాలని, అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పట్టణ, మండలంలోని రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. జూన్ నెల నుంచి రేషన్ దుకాణాల వద్దే నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని సూచించారు. పట్టణ, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

● నగరం, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండంలోని అన్ని ఎఫ్‌సీ షాపు డీలర్లతో తహసీల్దార్ నాంచారయ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కూపన్లు (ఈసీఎస్)పంపిణీపై విస్తృతంగా చర్చించగా ప్రజలకు నాణ్యమైన నిత్యవసర సరుకులను డీలర్లు బాధ్యతగా అందించాలని తహసీల్దార్ నాంచారయ్య ఆదేశించారు. సమావేశంలో ఆర్‌బిడీకే, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఇతర అధికారుల పాల్గొన్నారు. డీలర్లు తమ సమస్యలను, సూచనలను తహసీల్దార్‌కు తెలియజేశారు.

● కొల్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : జూన్ 1 నుంచి లబ్ధిదారులకు చౌకధరల దుకాణాలలో నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించినట్లుగా తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ గ్రామ రెవెన్యూ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. వీఆర్వోలందరూ చౌక ధరల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

● వేమూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : జూన్ నెల నుంచి రేషన్ కార్డుదారులకు నిత్యవసర సరుకులు పంపిణీ రేషన్ డీలర్ల వద్ద పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ సుశీల తెలిపారు. ఆమె శనివారం విలేకర్లతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి గతంలో మాదిరి రేషన్ షాపు డీలర్ల వద్ద కార్డుదారులు నిత్యవసర సరుకులు తెచ్చుకోవాలన్నారు. దివ్యాంగులకు, రేషన్ షాపునకు రాలేని వారికి డీలర్లే సరుకులు డోర్ డెలివరి చేయాలని సూచించారు.

● పిట్టలవానిపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం మండలంలోని అన్ని షాపులకు చెందిన డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వచ్చే నెల జూన్ ఒకటి నుంచి ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన డీలర్‌ల వ్యవస్థకు సంబంధిత డీలర్‌షాపుల వద్దనే వినియోగదారులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డీటీ ఫణికుమార్, వీఆర్‌వోలు, మండల డీలర్‌లు పాల్గొన్నారు.

ఆయుష్ మంత్రిత్వశాఖ సలహాకమిటీ సభ్యుడిగా

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, మే24 (ఆంధ్రజ్యోతి) : భారతప్రభుత్వం ఆయుష్ మంత్రిత్వశాఖ సలహాకమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోకసభ ప్యానల్ స్పీకర్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను శాశ్వత ప్రత్యేక ఆహ్వానిత సభ్యుడిగా నియమించారు. కేంద్ర పార్లమెంటరి వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ మేరకు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ కమిటీకి ఆయుష్ మంత్రిత్వ శాఖ స్వతంత్ర బాధ్యతల మంత్రి ప్రతాప్‌రావు గణపతిరావు జాదవ్ అధ్యక్షత వహిస్తారు. ఈ సందర్భంగా ఎంపీ కృష్ణప్రసాద్ ఆయుష్ మంత్రిత్వ శాఖ కమిటీలో కీలక బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ నియామకం ద్వారా ఆయుర్వేదం, యోగా, నాచరోపతి, యూనాని, సిద్ధ, హోమియోపతి వంటి సాంప్రదాయ వైద్యవిధానాల ప్రోత్సాహంలో పాలుపంచుకోనున్నారు.

కార్యకర్తలకు సభ్యత్వ కార్డుల బీమాతో భరోసా

- ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), మే 24 (ఆంధ్రజ్యోతి) : సభ్యత్వం కార్డులు కలిగిన కార్యకర్తలకు ప్రమాద బీమాతో టీడీపీ భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల కేంద్రం భట్టిప్రోలుకు చెందిన టీడీపీ కార్యకర్త షేక్ అన్వర్‌వలి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పార్టీ సభ్యత్వ కార్డు కలిగి ఉండటంతో నాయకులు అతని వివరాలను కేంద్ర కార్యాలయానికి ఎమ్మెల్యే ఆనందబాబు ద్వారా తెలియజేయడంతో సభ్యత్వం ద్వారా పొందిన ప్రమాద బీమా రూ.5 లక్షల చెక్కును శనివారం గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా కుటుంబ సభ్యులు అందుకున్నారు. చెక్కు పంపిణీ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్త కుటుంబానికి సభ్యత్వ బీమా చెక్కు రూ.5 లక్షలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

బీసీల అభ్యున్నతికి కృషి చేయాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన

రేపల్లె, మే 24(ఆంధ్రజ్యోతి) : బీసీల రక్షణ కోసం గల్లీ నుంచి ఢిల్లీవరకు అనేక పోరాట ఉద్యమాలు చేసి వారికి బీసీ సంక్షేమ సంఘం అండగా నిలిచిందని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. స్థానిక శారదా ఐటీఐ కళాశాలలో శనివారం బీసీసంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గం అనేక దశాబ్ధాలుగా బీసీలకు అండగా ఉందన్నారు. చట్టసభల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి రక్షణ చట్టం తెచ్చి మహిళా రిజర్వేషన్లను అమలు పర్చాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల దామాషా ప్రకారం వారికి సముచిత స్థానం కల్పించాలని కోరారు. అనంతరం బీసీ నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా నియమించారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా కేసన నాగమల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా చెన్ను నాగమల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మేకా వెంకటేశ్వరరావు, కేసన రాంబాబు, వుయ్యూరు శ్రీనివాసరావు, మరికొంత మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



కేసన నాగమల్లేశ్వరరావుకు నియామకపత్రాన్ని అందిస్తున్న శంకరరావు

వాతావరణంలో మార్పులు

- ఆందోళనలో రైతన్నలు

రేపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల తాకిడికి రైతన్నలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తీరప్రాంతంలో శనివారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావటం, కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు పడటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. నూర్చిన వరి ధాన్యాన్ని పంట పొలాల్లోనే ఎండపెట్టుకుంటున్నారు. ఈ తరుణంలో వాతావరణంలో మార్పులు, చిరుజల్లులు పడటంతో రైతన్నలు కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్ పట్టాలను కప్పుకుంటున్నారు. మొక్కజొన్న కొన్ని ప్రాంతాల్లో వరి పొలాల్లోనే ఆరబెట్టుకుంటున్నారు. రెండు, మూడు రోజుల పాటు వరుణుడు కరుణిస్తే గట్టెక్కుతామంటూ రైతులు మొక్కుకుంటున్నారు.



మోర్లవారిపాలెం పొలాల్లో నూర్చిన ధాన్యానికి పట్టాలు కప్పుకుంటున్న రైతులు

జనసేన సభ్యత్వ కిట్స్ పంపిణీ

రేపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ కార్యకర్తకు అండగా నిలిచేందుకే సభ్యత్వం అని ఆ పార్టీ ఎంపీటీసీ అల్లంశెట్టి సతీష్ అన్నారు. మండలంలోని ఉప్పూడి గ్రామంలో జనసేన సభ్యత్వ కిట్లను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉప్పూడి గ్రామంలో నూరుశాతం జనసేన సభ్యత్వాలు నమోదు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు యార్లగడ్డ వాసుదేవరావు, నరేష్, చిట్టిబాబు, తోట మధు, అల్లంశెట్టి కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతూ గొడవ... ఆందోళనకు దిగిన బాధితులు

బాపట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దగ్గుమల్లివారిపాలేనికి చెందిన యువకులు క్రికెట్ ఆడే విషయంలో గొడవపడ్డారు. ఈ గొడవ కాస్త పెద్దల వరకు వెళ్ళి కొట్లాటకు దారి తీసింది. ఈ సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు కాలనీవాసులతో కలిసి బాపట్ల పాతబస్టాండ్‌లో జీబీసీ రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈ సంఘటన శనివారం సాయంత్రం జరగ్గా రాత్రి ఆందోళనకు దిగారు. ఈ విషయంలో పోలీసులు తమకు అన్యాయం చేస్తున్నారని, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

కర్లపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం ఎట్రావారిపాలెం గ్రామానికి చెందిన ఆలపాటి రమణారావు భార్య రాజేశ్వరిదేవి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం 200 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. 400 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురువాణి పిరమిడ్ ధ్యాన కేంద్రం వ్యవస్థాపకులు కూనం చంద్రశేఖర్, గోవు వెంకట సుబ్రహ్మణ్యం, విష్ణుమూర్తి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు న్యాయం చేసేందుకు కృషి

● రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ● సురవరపల్లిలో పొగాకు పంటను పరిశీలన

పర్చూరు/మార్టూరు (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులకు న్యాయం జరిగేలా అన్ని విధాల కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం యద్దనపూడి మండలం సూరవారిపల్లిలో రైతులు నిల్వచేసుకున్న పొగాకు మండెలను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, పర్చూరు నియోజకవర్గంలో పొగాకు రైతుల సమస్యను స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ద్వారా ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో రాజకీయ యంత్రాంగంతోపాటు, ప్రభుత్వ యంత్రాంగం కూడా కదిలి వచ్చిందన్నారు. రైతుల సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యమని ఆయన గుర్తుచేశారు. అనంతరం మార్టూరు మండలంలోని ఎంఎల్‌పీ కంపెనీని సందర్శించి యాజమాన్యంతో కలసి ప్రాసెసింగ్ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, వ్యవసాయ కమిషనర్ ఢిల్లీ రావు, జిల్లా కలెక్టర్ వెంకట మురళి, ఆర్డీవో గ్లోరియా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో రైతులు, కంపెనీల ప్రతినిధులతో మంత్రుల బృందం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.


పొగాకు మండెలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖమంత్రి అచ్చెన్నాయుడు

అవీ..ఇవీ..

సర్వేలను వేగవంతం చేయాలి

వేటపాలెం(చీరాల), మే 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు జరుగుతున్న అన్నిరకాల సర్వేలను వేగంగా పూర్తిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని గ్రామవార్డు సచివాలయ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి విజయలక్ష్మీ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో రాజేష్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆరేళ్ల లోపే చిన్నారులకు ఆధార్ అందేలా చూడాలన్నారు. రైస్‌కార్డులకు సంబంబంధించి అందజేసిన లాగిన్‌లో త్వరగా డేటా అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, మండల పరిధిలోని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బైకును ఢీకొనడంతో ఘటన


గాయపడ్డ అశోక్

బల్లికురవ. మే 24 (ఆంధ్రజ్యోతి) : ఆటో, మోటారు సైకిల్‌ను ఢీకొట్టడంతో మోటారు సైకిల్‌పై వస్తున్న యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని మల్లాయపాలెం రోడ్డులో శనివారం చోటుచేసుకొంది. మల్లాయపాలేనికి చెందిన అశోక్ అనే యువకుడు తన బైకుపై బల్లికురవ వైపు వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న పాల ఆటో బైకును ఢీకొట్టింది. ఈప్రమాదంలో బైకుపై ఉన్న అశోక్‌కు తీవ్రగాయాలయ్యాయి. అపస్మారక స్థితికి చేరడంతో వెంటనే నరసరావుపేట వైద్యశాలకు క్షతగాత్రుడిని తరలించారు.

చీరాల్లో బిర్యానీ దొంగలు

చీరాల, మే 24 (ఆంధ్రజ్యోతి) : బిర్యాని తిని బిల్లు ఎగ్గొట్టడంతో ఇద్దరు వ్యక్తులు చేసిన పని అచ్చం సినిమా సన్నివేశాలను తలపించింది. చీరాల పట్టణంలోని ఓ బిర్యాని పాయింట్‌కు శనివారం మధ్యాహ్నం ఇద్దరు స్నేహితులు వచ్చారు. బిర్యానీ ఆర్డర్ చేసుకుని తిన్నారు. ముగిశాక ముందుగా వారిలో ఓ వ్యక్తివాష్ బేసిన్ వద్దకు వెళ్లి చేతులు శుభ్రపరచుకున్నారు. తన మిత్రుడు డబ్బులు కడతాడని చెప్పి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి రెండోవ్యక్తి వాష్‌బేసిన్ వద్దకు వెళ్లి చేతులు శుభ్రపరచుకున్నాడు. ఫ్యాంట్ పైకి లాక్కుని ఒక్క ఉదుటున పరుగులంకించాడు. అయితే గమనించిన దుకాణంలో పనిచేసే యువకుడు దాదాపుగా 300 మీటర్లు వెంబడించాడు. అయినా బిర్యాని దొంగలు కనపడలేదు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్యాయత్నం

ఇంటి నుంచి పారిపోయిన మహిళ

వెతికి పట్టుకున్న పోలీసులు

మేదరమెట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లకు చెందిన వివాహిత అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకోవడానికి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తన గురించి ఎవరు వెతక వద్దని తాను ఆత్మహత్య చేసుకుంటు న్నానని కుటుంబ సభ్యులకు సందేశం పంపింది. తనభర్త చాల మంచివాడని ఆయనకు మరో వివాహం చేయాలని పేర్కొంది. అనారోగ్య సమస్యల వలన ఆత్మహత్య చేసుకుంటున్నాని లేఖ రాసి ఇంటి నుంచి వెళ్లింది. దీంతో వివాహిత తల్లి మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే మేదరమెట్ల ఎస్సై బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ దృష్టికి విషయం తీసుకుపోయారు. చీరాల డీఎస్పీ మోయిన్, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావులు మూడు టీంలను ఏర్పాటు చేసి కొత్తపట్నం, చినగంజాం, చీరాల సముద్రతీరాలకు వెళ్లి మహిళ ఆచూకి కోసం వెతికారు. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ఆమెను కొత్తపట్నంలో పట్టుకున్నారు. ఆమెను చాకచక్యంగా కాపాడిన పోలీసులకు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ ప్రచారవిభాగం సంయుక్త కార్యదర్శిగా అంకారావు

మేదరమెట్ల, మే 24, (ఆంధ్రజ్యోతి) : కోరిశపాడు మండలం మేదరమెట్లకు చెందిన వైసీపీ నాయకుడు కోయి అంకారావును వైసీపీ కేంద్ర కార్యాలయం రాష్ట్ర ప్రచార విభాగం పబ్లిసిటీ విభాగంలో సంయుక్త కార్యదర్శిగా నియమించింది. అంకారావు గతంలో అద్దంకి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. మండలంలో వైసీపీ కీలక నేతల్లో ఒకరుగా ఉన్నారు.

ముమ్మరంగా విభిన్న ప్రతిభావంతుల సర్వే


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

చీరాల, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సర్వేను ముమ్మరం చేసింది. ఈ సర్వే ద్వారా 0 నుండి 18 సంవత్సరములు వరకు ఉన్న విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించి వారికి నాణ్యమైన విద్య, కావాల్సిన పరికరాలు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిల్స్ అందించనున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 సుధారాణి మాట్లాడుతూ మే 13 నుంచి జూన్ 9 వరకు సర్వే చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని విభిన్న ప్రతిభా వంతులను గుర్తించి భవితా కేంద్రాల ద్వారా స్పీచ్‌థెరపీ, ఫిజియో థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్‌తో పాటు ఆటిజం లక్షణాలకు చికిత్స అందించనున్నట్లు చెప్పారు. శనివారం నిర్వహించిన సర్వేలో ఎంఈవోతో పాటు దరబడి రాజశేఖర్, వి.నరసింహం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ప్లాస్టిక్‌ను నిషేధించాలి


అవగాహన కల్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

చినగంజాం, మే 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు సహకరించాలని కడవకుదురు గ్రామ సచివాలయ 1, 2 గ్రామ కార్యదర్శులు పర్చూరు శ్రీనివాసరావు, మాజేటి వెంకటరమణలు అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, గ్లాసులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధంపై, పారిశుధ్యంపై శనివారం గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తడి, పొడి చెత్త పారిశుధ్యం, నిషేధిత ప్లాస్టిక్‌పై గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శులు తెలిపారు. గ్రామంలోని కిరణా దుకాణాల యజమానులకు, ఇంటింటికి తిరిగి నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించరాదని, అమ్మేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ 1, 2 వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

రేషన్ వాహనాల సిబ్బందిని కొనసాగించాలి

అద్దంకి,మే24(ఆంధ్రజ్యోతి):రేషన్ పంపిణీ వాహనాల (ఎండీయూ)సిబ్బంది శనివారం తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎలాంటి చర్యలు జరపకుండా ఏకపక్షంగా తొలగించడం దారుణం అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ అన్నారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, గంగాధర్, కరీమ్, ఎండీయూ వాహనాల సిబ్బంది రాజశేఖర్, జాన్సన్, హరీష్, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాగులు కాదు..రహదారులే..

● జలమయమైన రహదారులు
● అవస్థలు పడుతున్న ప్రజలు, వాహన దారులు

ఈపూరుపాలెం(చీరాల), మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరుపాలెం నుంచి చుట్టుపక్కల ప్రాంతాలకు ఎటు వెళ్లాలన్నా, అధ్వానపు రహదారులే దర్శన మిస్తున్నాయి. అసలే ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. దానికి తోడు వరుసగా నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు ప్రయాణాలు నరకప్రాయంగా మారుతున్నాయి. చీరాల నుంచి నిత్యం ఈపూరుపాలెం మీదుగా హెవీ, చిన్న తరహా వాహనాలు వందల సంఖ్యలో ప్రయాణం సాగి స్తుంటాయి. ఈ నేపథ్యంలో శిథిలమైన రహదారులు, జలమయ మైన దారులు కారణంగా వాహనదా రులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈపూరుపాలెం నుంచి భావనారుషి పేటకు వెళ్లే మార్గం గోతులమయంగా మారింది. అటువైపు వీధి దీపాలు కూడా లేకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే తోటవారిపాలెం, ఈపూరుపాలెం వైపు నుంచి సాయి కాలనీ వైపు వెళ్లే రహదారులు దారుణంగా ఉన్నాయి. ఘోరంగా దెబ్బతిని గోతులు పెద్దఎత్తున ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలు పట్టించుకోవాలని పాలకులు, అధికారులను కోరుతున్నారు.


ఈపూరుపాలెం - భావనారుషిపేట రహదారి


చీరాల - బాపట్ల ప్రధాన రహదారి

కబడ్డీ క్రీడాకారులకు క్రీడాదుస్తుల అందజేత



క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందజేస్తున్న దాతలు

చినగంజాం, మే 24(ఆంధ్రజ్యోతి) : మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో కబడ్డీ వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు శనివారం దాతలు క్రీడాదుస్తులను అందజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్, చినగంజాం బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో గత నెల 20వ తేదీ నుంచి కబడ్డీ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ శిబిరంలో ప్రతి రోజూ 120 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నట్లు క్లబ్ అధ్యక్షులు, కోచ్ ఎం.గిరిబాబు తెలిపారు. వీరికి స్పోర్ట్స్ క్లబ్ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు వెంకటేష్‌రెడ్డి (మదనూరు), పెదగంజాం గ్రామానికి చెందిన కోమట్ల పవన్‌కళ్యాణ్‌రెడ్డిలు తమ సొంత నిధులతో క్రీడాదుస్తులను సమకూర్చారు. దాత వెంకటేష్‌రెడ్డి, పవన్‌కళ్యాణ్‌రెడ్డి తల్లిదండ్రులు రమేష్‌రెడ్డి, రమాదేవీలు క్రీడాకారులకు క్రీడాదుస్తులను, కోచ్ గిరిబాబుకు ట్రాక్ షూట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీసి, రాష్ట్ర జట్టులో ప్రాతినిధ్యం వహించే అర్హత సాధించాలన్నదే క్లబ్ ఆశయమన్నారు. కార్యక్రమంలో బీకే స్పోర్ట్స్ క్లబ్ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

అద్దంకిలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

అద్దంకి, మే24(ఆంధ్రజ్యోతి): మండు వేసవిలోనూ గత 10 రోజులుగా కురుస్తున్న వర్షపు జల్లులకు వాతావరణం చల్లబడింది. శనివారం పగలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి కాగా రాత్రి 8-30 గంటల సమయం నుండి భారీ వర్షం ప్రారంభమైంది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. గాలులతో విద్యుత్ సరఫరా కు తరచూ అంతరాయం ఏర్పడింది.


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పిడుగుపాటుకు పొగాకు మండెలు దగ్ధం

పర్చూరు: పిడుగుపాటుకు పొగాకు మండెలు, కొష్టాలు దగ్ధమైన ఘటన మండలంలోని దేవరపల్లిలో శనివారం రాత్రి చోటుచేసు కొంది. రాత్రి 10 గంటల తర్వాత ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో వర్షం కురిసి పిడుగులు పడడంతో తోకల సుబ్బా రావు, తోకల శివనాగేశ్వరరావుకు చెందిన పొగాకు మండెలు, కొష్టాలు దగ్ధమయ్యాయి. చీరాల నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.


అద్దంకిలోకురుస్తున్న వర్షం

పదో రీవాల్యూయేషన్‌లో మార్కులు మెరుగు

● షణ్ముక ప్రియకు మండల స్థాయిలో ద్వితీయ స్థానం

అద్దంకిటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): పదివ తరగతి పరీక్షల రీవాల్యూయేషన్‌లో అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినికి మంచి మార్కులు సాధించింది. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కొంగర షణ్ముక ప్రియకు గతంలో 582 మార్కులు వచ్చాయి. ప్రస్తుతం ఇంగ్లీష్ రీవాల్యూయేషన్‌కు పెట్టుకోగా 86 మార్కుల నుంచి 96 మార్కులకు పెరిగాయి. దీంతో మొత్తం 592 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానం సాధించింది. పదవ తరగతి ఫలితాలల్లో ఈ ఏడాది అద్దంకి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. మరికొంత మంది విద్యార్థులకు కూడా రీవాల్యూయేషన్‌లో మార్కులు పెరిగినట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు.

ధనుష్‌కు 593 మార్కులు

పందిళ్లపల్లి(చీరాల) : పదవ తరగతి ఫలితాల రీవాల్యూయేషన్‌లో వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పృధివి ధనుష్ 593 మార్కులు సాధించాడు. అంతకు ముందు విడుదలైన ఫలితాల్లో 589 మార్కులు రాగా, రీ వాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈక్రమంలో తెలుగు లో నాలుగు మార్కులు అదనంగా రావడంతో పాఠశాల ఉపాధ్యాయులు ధనుష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటికే ఈ స్కూల్ విద్యార్థిని 596 మార్కులతో రాష్ట్రంలో తృతీయ స్థానం, జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన విషయం పాఠకులకు విదితమే.


పృధివి ధనుష్

పారదర్శకంగా రేషన్‌పంపిణీ

చీరాల, మే 24 (ఆంధ్రజ్యోతి) : జూన్ 1 నుంచి ఇంటింటా రేషన్ పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని చీరాల మండల తహసీలార్ గోపీకృష్ణ, వేటపాలెం మండల తహసీల్దార్ పార్వతి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం వారి కార్యాలయాల్లో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులకు 5వ తేదీలోపే వారి ఇళ్లకు రేషన్ చేరాలన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గం.నుండి 8గంటల వరకు పంపిణీ చేయాలని సూచించారు. అధికారుల తనిఖీల సమయంలో నిల్వల్లో వ్యత్యాసం లేకుండా చూసుకోవాలన్నారు. భిన్నంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రెండు మండలాల డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాతపద్ధతిలోనే రేషన్ డీలర్లు ప్రజాపంపిణీ చేపట్టాలని తహసీల్దార్ సింగారావు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. డీలర్లు ప్రతినెల 1వ తేదీ నుండి 18 వరకు కార్డుదారులకు రేషన్ అందచేయాలన్నారు. ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల దుకాణం తెరిచి ఉంచి సరుకులు అందించాలన్నారు. జూన్ ఒకటి నుండి ఈ విధానం అమలులోకి వస్తున్నందున రేషన్ సాపు డీలర్లు అందుకు అనుగుణంగా పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ అర్జున్, ఆర్ఐ శ్వేత, సర్వేయర్ సురేష్, డీలర్ల సంఘం అధ్యక్షులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

పంగులూరు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైటమంజులూరు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయిన ఘటనలో ముగ్గురికి రక్తగాయాలయ్యాయి. అద్దంకి మండలం దేనువకొండ గ్రామానికి చెందిన ప్రేమసాగర్, పూర్ణమ్మ, చిన్నారి మేషక్‌లు ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట నుండి అద్దంకి వెలుతుండగా బైటమంజులూరు సమీపంలో బైకు అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయాలపాలైన వీరిని స్థానిక పోలీసులు హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బస్సు ఢీ కొని గేదె మృతి

పంగులూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైటమంజులూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై బస్సు ఢీ కొని గేదె మృతి చెందింది. శనివారం రాత్రి సమయంలో జాతీయ రహదారి దాటుతున్న గేదెల గుంపును ఒంగోలు నుండి విజయవాడ వైపు వెలుతున్న ఇంద్ర ఆర్టీసీ. బస్సు వేగంగా ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలంలో ఓ గేదె మృతి చెందగా, మరో గేదె తీవ్ర గాయాలతో చావు బతుకుల మధ్య కొటుమిట్టాడుతుంది. వీహైవే పెట్రోలింగ్ సిబ్బంది క్రేన్ సాయంతో గేదెను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

వేగం.. ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

చేసుకోవచ్చు. అత్యంత అప్రమత్తంగా నియమాలకు అనుగుణంగా ఉండాల్సిన ప్రయాణం కొద్దిపాటి నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఒకరి నిర్లక్ష్యం అన్నెం, పున్నెం ఎరుగని ఇతరుల ప్రాణాలు పోవడానికి కారణమవుతుంది. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయేవారు కొందరైతే అవయవాలు కోల్పోయి విగత జీవులుగా మారుతున్న వారు ఎందరో ఉంటున్నారు. రోడ్డు ప్రమాదాలపై ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన వాహనదారుల తీరులో మార్పు కనబడటం లేదు. గత కొంత కాలంగా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా పెరిగాయి. మృతుల్లో ఎక్కువ మంది యువకులే ఉండటం మరింత ఆందోళన కల్గించే విషయం. ఏటా రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతుల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. దీనికి తోడు ఏడాదిలో 3 శాతం ప్రమాదాలు తగ్గించాలని పెట్టుకున్న లక్ష్యాలు ప్రణాళికలకు మాత్రమే పరిమితమయ్యాయి.

అర్బన్‌లోనే అత్యధికం

రోడ్డు ప్రమాదాల, మృతుల విషయంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో నమోదైన గణాంకాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. మృతుల్లో మూడో వంతు అర్బన్ పరిధిలో ఉంటున్నాయి. సిబ్బంది పరంగా కొరత లేనప్పటికి ఈ స్థాయిలో ప్రమాదాలు జరగడం అంతు చిక్కని ప్రశ్నగా మారింది. ప్రధానంగా గుంటూరు నగరం, ఇతర ప్రధాన పట్టణాల్లో యువత బైక్ రేసింగ్‌లు ఎక్కువ అవుతున్నా వాటిపై నిఘా కొరవడిందని.. అందువల్లే ప్రమాదాలు, మరణాలు ఎక్కువ జరుగుతున్నాయని తెలుస్తోంది. కళాశాలలు అధికంగా ఉండటం వల్లే యువత బైక్ ప్రమాదాల బారిన పడుతున్నారని అధికారులు చెబుతున్నా నివారణ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నామమాత్రపు తనిఖీలు, కొద్దిపాటి జరిమానాలు, తూతుమంత్రపు కౌన్సిలింగ్ వంటి చర్యలతో ఫలితాలు లేవని రుజువు అవుతున్నా అధికారుల్లో చలనం ఉండటంలేదు.

మనకేందుకులే అనే ధోరణి

ప్రమాదం జరిగినప్పుడు చూసిన వ్యక్తులు సమాచారం ఇవ్వడానికి ముందుకు రాకపోవడం కూడా మృతుల సంఖ్య పెరగడానికి మరో కారణం. ప్రమాదం జరిగిన తొలిగంటలో సమాచారం ఇస్తే 70 శాతం వరకు ప్రాణాలను కాపాడవచ్చు. దీనిని గోల్డెన్ అవర్ అని అంటారు. అయితే ప్రమాద సమాచారం ఇస్తే చట్టపరంగా ఏమైనా ఇబ్బందులు వస్తాయనే భయం, మనకేందుకులే అనే ధోరణి పలువురిలో ఇప్పటికీ ఉంది. ప్రమాద సమాచారం ఇచ్చిన వారికి రూ.5 వేలు నజరానా, ప్రశంసాపత్రం, చట్టప్రకారం ఇబ్బందులు లేకుండా చూడటం వంటి నియమాలు అందుబాటులోకి వచ్చినా ఎవరూ ముందుకు రావడం లేదు.

క్షతగాత్రుల వేదన చూసి మార్పు

రోడ్డు ప్రమాదంలో సభ్యుడిని కోల్పోయి ఆ కుటుంబం ఎంత మానసిక వేదనకు గురవుతుందనే విషయంపై జర్మనీలో విద్యార్థులను ఆయా కుటుంబాల వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విద్యార్థులు, యువతకు ట్రాఫిక్ రూల్స్ నేర్పడంతో పాటు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రమాదాలను నివారించవచ్చనేది వారి నమ్మకం. ఈ విధానం ద్వారా జర్మనీలో కొంత మేరకు ఫలితాలు సాధించారు.

పొగాకు కొనకుంటే ఆత్మహత్యలే శరణ్యం

మంత్రుల ఎదుట గోడు వెళ్లబోసుకున్న రైతులు

పర్చూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : పొగాకు కంపెనీల మాయాజాలంతో తీవ్రంగా నష్టపోయామని, తమ వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని పలు గ్రామాల రైతులు మంత్రుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు.. పొగాకు కంపెనీల మాటలు విని అప్పుచేసి మరీ వేల ఎకరాల్లో బర్లీ పొగాకును సాగు చేశామన్నారు. అయితే ప్రస్తుతం పంట చేతికి అందివచ్చినా అమ్ముకోలేని దుస్థితి నెలకొందన్నారు. నాడు సాగును ప్రోత్సహించిన కంపెనీలు నేడు కొనుగోలు చేయకుండా ముఖం చాటేస్తున్నాయన్నారు. ఇప్పుడు తమ పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని మంత్రుల ముందు రైతులు కన్నీటి పర్యంత మయ్యారు. పొగాకు రైతుల సమస్య పరిష్కారం కోసం శనివారం మార్టూరు మండలం ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారధ్యంతో ఆయా పొగాకు కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల సమక్షంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పర్చూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి పెద్దఎత్తున పొగాకు రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి ఆధ్యక్షతన నిర్వహించిన ముఖాముఖిలో రైతులు తమ గోడు వినిపించారు.


మంత్రులతో సమస్యను వెల్లడిస్తున్న మహిళా రైతు రమాదేవి

జీపీఐ కంపెనీని నమ్మి మోసపోయాం

పొగాకు కంపెనీ మాటలువిని మోసపోయాం. గత ఏడాది కొద్ది మొత్తంలో బర్లీ పొగాకును సాగుచేసుకున్నాను. అయితే ఈ ఏడాది జీపీఐ పొగాకు కంపెనీ ప్రతినిధులు మా వద్దకు వచ్చారు. ఈ ఏడాది ధర బాగా ఉంటుంది, పండించిన పంట మొత్తం మేమే కొనుగోలు చేస్తామని పదేపదే చెప్పి నమ్మబలికారు. తీరా పంట చేతికి వచ్చి అమ్ముకుందామనే సమయానికి సిబ్బంది ముఖం చాటేశారు. వారికి ఫోన్‌చేస్తే కనీసం స్పందించడం కూడాలేదు. లక్షలు రూపాయలు అప్పులు తీసుకువచ్చి సాగు చేశాం. ఇప్పడు ఏమిచేయాలో పాలుపోవడం లేదు.

మహిళా రైతు రమాదేవి, దుద్దుకూరు

పొలాల వద్ద వాములు వేశాం

పండిన బర్లీ పొగాకును కొనుగోలు లేక పొలాల్లోనే వాములుగా వేశాం, వర్షాకాలం కూడా ముంచుకు వస్తుండడంతో ఏమిచేయాలో పాలుపోవడం లేదు. పంట చేతికి వచ్చి నెలలు గడుస్తున్నాకొనే నాథుడే కరు వయ్యారు. పొగాకు కంపెనీల మయమాటలు నమ్మి నిలువునా మోసపోయాం.



సలిసం వాసుబాబు, భీమవరం

ఎవరికీ ఇవ్వద్దు మేమే కొంటాం.. అనిచెప్పారు

'పొగాకు ఎంత మొత్తంలో సాగుచేసినా మొత్తం మేమే కొంటాం ఎవరికి ఇవ్వవద్దు' అని జీపీఐ కంపెనీ సిబ్బంది నాడు నమ్మబలికారు. కనీసం వారు కనిపిచడం కూడా లేదు. కంపెనీ వారి మాయమాటలు నమ్మి అధిక మొత్తంలో పొగాకు సాగు చేశాం. ఏమిచేయాలో అర్థంకావడం లేదు.



జరుగుల హరిబాబు, రైతు దుద్దుకూరు